

సింగాపూర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



హుజూరాబాద్ టౌన్: కరపత్రం ఇస్తూ ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డి సతీమణి శాలిని తదితరులు

## ఇంటింటికీ బీఆర్ఎస్

- పథకాలు వివరిస్తూ.. ప్రజలను ఓటు అభ్యర్థించిన గులాబీ శ్రేణులు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 4: పట్టణంలోని డీసీఎంఎస్ కాంప్లెక్స్, అంబేద్కర్ చౌరస్తా, వరంగల్‌రోడ్‌లో శనివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి సతీమణి శాలిని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజలకు బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలను పంచుతూ ఓటు అభ్యర్థించారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు చేస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి కోసం తన భర్త కౌశిక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆమె వెంట పురపాలక సంఘం చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, అధ్యక్షురాలు, కౌన్సిలర్ కల్లెపల్లి రమాదేవి, సోషల్ మీడియా రాష్ట్ర నాయకురాలు గొడిశాల పావని, కౌన్సిలర్లు కే లావణ్య, ఎం ఉమాదేవి, ఎం సృజన, కే జీవిత, తాళ్లపెల్లి శ్రీనివాస్, కుమార్‌యాదవ్, ముత్యంరాజు, ఉమామహేశ్వర్, వీ కిషన్, సీనియర్ నాయకురాలు ప్రభావతిరెడ్డి, కే శ్రీదేవి, పీ లతారెడ్డి, రేణుక, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు ఉన్నారు.

*సింగాపూర్‌లో..*

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 4: మండలంలోని సింగాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ఓటర్లకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామాధ్యక్షుడు కుమార్, యూత్ సభ్యులు రాకేశ్, అశోక్, వీరస్వామి, రాజ్‌కుమార్, శ్రీకాంత్, వంశీ, కౌశిక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## అభిమాని చేతిపై కౌశిక్ టాటూ

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 4: పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త తాటిపాముల రమేశ్ తన చేతిపై పార్టీ హుజూరాబాద్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి చిత్రాన్ని టాటూగా వేయించుకొని అభిమానాన్ని చాటుకున్నాడు. తన అభిమాన నాయకుడి గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు. కాగా, ప్రచారంలో పాల్గొంటున్న రమేశ్ వేయించుకున్న టాటూ ప్రత్యేక ఆకర్షణగా నిలిస్తోంది.



చేతిపై కౌశిక్ టాటూ వేయించుకున్న రమేశ్. (ఇన్‌సెట్‌లో టాటూ)

## విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ సంపత్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 4: విద్యార్థులు మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని, ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ ఆవుల సంపత్ పేర్కొన్నారు. శనివారం మహిళా శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హుజూరాబాద్‌లోని సైదాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో(బాలుర) అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలు ముఖ్యంగా స్మార్ట్ ఫోన్ వినియోగం, డ్రగ్స్ లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియా, సినిమాల ప్రభావంతో చెడు మార్గంవైపు వెళ్లకూడదని, మంచి లక్ష్యం నిర్దేశించుకొని దానిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే చైల్డ్‌హెల్ప్ లైన్ 1098లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రవీందర్, ఐసీపీఎస్ లీగల్ ఆఫీసర్ రాజు, కౌన్సిలర్ తేజస్విని, సోషల్ వర్కర్ రమేశ్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సూపర్‌వైజర్ కుమారస్వామి, ఔట్ రీచ్ వర్కర్స్ రమేశ్, స్వప్న, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చెల్పూర్ వాసికి డాక్టరేట్



ప్రతిమ

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 4: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన తిరుణహరి ప్రతిమకు రాజస్థాన్ రాష్ట్రంలోని మేవార్ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో ఈ నెల 3న డాక్టరేట్(పీహెచ్‌డీ) ప్రకటించింది. హనుమకొండలోని కేర్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రతిమ 'డిజైన్ డెవలప్‌మెంట్ అండ్ స్క్రీనింగ్ ఫర్ పాసిబిల్ ఫార్మకలాజికల్ ఆక్టివిటీస్ ఆఫ్ నావెల్ నైట్రోజన్ అండ్ ఆక్సిజన్ కంటేయినింగ్ హెటెరో సైక్లిక్ కాంపౌండ్స్' అంశంపై యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ టీ రామమోహన్ రెడ్డి పర్యవేక్షణలో థీసిస్ సమర్పించారు. ఈ పరిశోధనకు గానూ డాక్టరేట్ వచ్చినట్లు ఆమె తెలిపారు. కాగా, ప్రతిమ డాక్టరేట్ అవార్డు అందుకున్న సందర్భంగా కుటుంబ సభ్యులు, మిత్రులు, కళాశాల బృందం అభినందనలు తెలియజేశారు.

## నేడు వీణవంకలో 'పాడి' ప్రచారం

వీణవంక, నవంబర్ 4: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బీఆర్ఎస్ హుజూరాబాద్ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి ప్రచారం చేయనున్నట్లు ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం మండలంలోని రామకృష్ణాపూర్, హిమ్మత్‌నగర్, కొండపాక, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దిరెడ్డితో కలిసి ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు , అన్ని వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## రెండో రోజు రెండు నామినేషన్లు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 4: హుజూరాబాద్ శాసనసభ నియోజకవర్గానికి రెండో రోజు శనివారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి ఎస్ రాజు తెలిపారు. ఇందులో ఒకరు స్వతంత్ర అభ్యర్థి కాగా, మరొకరు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి నామినేషన్ వేశారని చెప్పారు. అభ్యర్థులు ఉదయం 11 గంటల నుంచి మూడు గంటల్లోపు నామినేషన్ వేయాలని సూచించారు. అభ్యర్థులకు ఆర్వో కార్యాలయంలో అధికారులు సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



లక్ష్మాజీపల్లిలో పరీక్షలు చేస్తున్న వైద్యుడు తులసీదాస్

ఇల్లందకుంట, నవంబర్ 4: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని వైద్యాధికారి తలసీదాస్ సూచించారు. శనివారం మండలంలోని లక్ష్మాజీపల్లి గ్రామంలో ఇల్లందకుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనారోగ్యం పాలైనప్పుడే నిర్లక్ష్యం చేయకుండా నేరు దవాఖానకు వస్తే, వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను అందిస్తామన్నారు. ఇక్కడ హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ఆరోగ్యానికి చిరుధాన్యాలే మేలు

- పాలియో డైట్ ఆరోగ్యానికి హానికరం
- మిల్లెట్స్‌తో అనేక పిండి వంటలు తయారీ చేసుకోవచ్చు
- జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఆలేటి ప్రశాంతి.. జమ్మికుంట కేవీకేలో మహిళలకు శిక్షణ



చిరు ధాన్యాలతో వంటల తయారీపై శిక్షణ తీసుకుంటున్న మహిళలు

జమ్మికుంట, నవంబర్ 4: పాలిడైట్ వంటి ఆధునిక ఆహారం ఆరోగ్యానికి హానికరమని, సంపూర్ణ ఆరోగ్యానికి చిరుధాన్యాలే మేలని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఆలేటి ప్రశాంతి తెలిపారు. స్టేట్ అగ్రికల్చరల్ మేనేజ్‌మెంట్ అండ్ ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్(సమేటి), వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ)సౌజన్యంతో జమ్మికుంట కేవీకేలో 'చిరు ధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ'పై గ్రామీణ యువతకు నైపుణ్యత శిక్షణ కార్యక్రమాన్ని గత ఆరు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జిల్లాలోని పలువురు మహిళలకు చిరు ధాన్యాలతో పిండి వంటలు, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. శనివారం ముగింపు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జొన్నలు, సజ్జలు, కొర్రలు, రాగులు, సామలు, అరికెలు, ఊదలు, అవిసెలు, అండ్రుకొర్రలు, తదితర చిరు ధాన్యాల్లో అనేక పోషక విలువలున్నాయని తెలిపారు. సిరి ధాన్యాలను అనేక రకాలుగా వాడుకోవచ్చని సూచించారు. సిరి ధాన్యాలతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రస్తుత కాలంలో ఆరోగ్యంపై ప్రతి ఒక్కరికీ శ్రద్ధ పెరిగిందని, కొంచెం ధరలు ఎక్కువైనా కూడా వాడకంలోకి వచ్చాయని తెలిపారు. మిల్లెట్స్‌పై శిక్షణ తీసుకున్న మహిళలు పిండి వంటలు, స్వీట్లు తయారీ చేస్తున్నారని, మహిళా గ్రూపుగా ఏర్పడి ఫంక్షన్లకు సరఫరా చేయాలని సూచించారు. మిల్లెట్స్ తయారీ ద్వారా ఉపాధిని సాధించాలని, ఆర్థికంగా ఎదగాలని కోరారు. అంతే కాకుండా గ్రామాల్లో మిల్లెట్స్ తినడం వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేయాలని, ప్రజల్లో చైతన్యం కలిగించాలని సూచించారు. ఆహారంలో విరివిగా ఉపయోగించడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులను నయం చేస్తాయని చెప్పారు. శిక్షణ పొందిన మహిళలకు ఎల్లప్పుడూ సహకరిస్తామని, మార్కెటింగ్ కోసం సంప్రదించాలని పేర్కొన్నారు. ఇక్కడ శాస్త్రవేత్త మహేశ్, శిక్షణ పొందిన మహిళలున్నారు.

### మిల్లెట్స్‌పై అవగాహన ఉంది



మాది ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లి. నేను, నా కూతురు, మా ఆడబిడ్డ... ముగ్గురం ఇక్కడ శిక్షణ తీసుకునేందుకు వచ్చినం. మిల్లెట్స్‌పై మాకు అవగాహన ఉంది. మా భర్త శ్రీకాంత్ సేంద్రియ సాగు చేస్తడు. మిల్లెట్స్ పంట తీస్తడు. రకరకాల పిండి వంటలు చేస్తం. అయినా శిక్షణ తీసుకున్నం. మరింత అవగాహన పెంచుకున్నం. కొత్త రకాల వంటల తయారీ నేర్చుకున్నం. మాకు ఉపయోగపడ్తయ్.

*-గారంపల్లి శ్రీలత, గృహిణి(శ్రీరాములపల్లి)*

### శిక్షణలో కొత్త రకాల వంటలు నేర్చుకున్నం



ఇప్పటి వరకు చిరు ధాన్యాల గురించి అంతగా తెల్వదు. వినడమే తప్ప.. అన్ని ధాన్యాలు చూడనే లేదు. శిక్షణకు రావాలని కేవీకే వాళ్లు పిలిచారు. కొత్త విషయం తెలుసుకునేందుకు వచ్చిన. వచ్చిన తర్వాత తెలిసింది. ఇది గొప్ప శిక్షణ అని. ఆరు రోజుల శిక్షణలో సిరి ధాన్యాల గురించి తెలుసుకున్నం. రకరకాల వంటలు చేసినం. గొప్ప అనుభూతినిచ్చింది. శిక్షణ తర్వాత అందరం కలిసి వంటల కేంద్రం పెడ్తం. ఉపాధి పొందుతం.

*- ఎల్కసౌజన్య, గృహిణి(నర్సింగాపూర్)*

## సీతంపేటలో పంటకోత ప్రయోగం



పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఏవో గుర్రం రజిత

ఇల్లందకుంట, నవంబర్ 4 : మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన తెడ్ల రాజ అనే రైతు క్షేత్రంలో శనివారం వ్యవసాయాధికారులు పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భగా ఏవో రజిత మాట్లాడుతూ, వానకాలంలో రైతులు ఎక్కువగా వరి సాగు చేశారని తెలిపారు. దిగుబడులను అంచనా వేసేందుకు పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సీజన్‌లో ఎకరానికి 28 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. ఇక్కడ ఏఈవో రాకేశ్, రైతులు ఉన్నారు.